కార్నివాల్‌–2025 ఫ్యాషన్‌షో



రాయదుర్గం: ఫ్యాషన్‌ షోలో రాయదుర్గం ఫుట్‌వేర్‌ డిజైన్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ ఇన్‌స్టిట్యూట్‌ (ఎఫ్‌డీడీ) విద్యార్థులు పాల్గొన్నారు.నగరంలోని సంఘమిత్ర స్కూల్‌లో బ్యూరో ఆఫ్‌ ఇండియన్‌ స్టాండర్డ్స్‌ హైదరాబాద్‌ బ్రాంచ్‌ ద్వారా కార్నివాల్‌–2025 పేరిట నిర్వహించిన ఫ్యాషన్‌ షోలో ఎఫ్‌డీడీఐలోని ఫుట్‌వేర్‌ డిజైన్‌ అండ్‌ ప్రొడక్షన్‌ విభాగానికి చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ షోలో ప్రతిభ చాటిన విద్యార్థులను ఎఫ్‌డీడీఐ హైదరాబాద్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ నరసింహుగారి తేజ్‌లోహిత్‌ రెడ్డి, ఫ్యాకల్టీ ప్రతినిధులు అబ్దుల్‌ రహమాన్‌, చంద్రమణి, కన్వర్‌సింగ్‌, ఇళయరాజా అభినందించారు.

విశ్వశాంతి మహా యజ్ఞం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని వైశాలినగర్‌లో జైన్‌ కమ్యూనిటీ ఆధ్వర్యంలో శనివారం సిద్ధి చక్రం విశ్వశాంతి మహా యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌లు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌ యాదవ్‌, శాస్త్రి, సంబాత్‌ జైన్‌, శిల్ప జైన్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌ చెక్కు అందజేత




రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌ గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఎస్‌కే సొహైల్‌కు అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం విడుదలైన సీఎం రిలీఫ్‌ఫండ్‌ రూ.2.50 లక్షల మంజూరుపత్రాలను ఎమ్మెల్యే గాంధీ శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ నీలం రవీందర్‌ముదిరాజ్‌, ఖాదర్‌, బోయ కిషన్‌, మోజెస్‌, భాస్కర్‌, ఖలీమ్‌, అన్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదా రంగనాథ స్వామి కల్యాణం



రాయదుర్గం: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని గోదా రంగనాథస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి ఖాజాగూడలో కొమిరిశెట్టి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు



కొండాపూర్‌లోని సంస్కృతి పాఠశాలలో..

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని సంస్కృతి గ్రూప్‌ ఆఫ్‌ స్కూల్స్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు సంక్రాంతి పండగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకమండలి, ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే గౌతమి విద్యా క్షేత్రలో జరిగిన వేడుకల్లో హరిదాసు వేషధారణలో సాయి హిరణ్య ఆకట్టుకుంది.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలోని వివిధ కాలనీల్లో కోటి రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపల్‌ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రూ.8 లక్షల నిధులతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను రెనోవేట్‌ చేసిన కోకోకోల సంస్థను అభినందించారు.

వంటలు నేర్చారు.. వండి రుచి చూపారు



గచ్చిబౌలి నిథమ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు

నిథమ్‌లో 6వ బ్యాచ్‌ ఐఎంఎస్‌సీ మహిళలకు శిక్షణ పూర్తి



రాయదుర్గం: గచ్చిబౌలిలోని 'నిథమ్‌'లో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ల మహిళలు 6వ బ్యాచ్‌కు చెందిన 24 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. 'నిథమ్‌' చెఫ్‌లు మహేష్‌, తుల్జారామ్‌ల పర్యవేక్షణలో పదిరోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. చికెన్‌ బిర్యానీ, వెజ్‌ బిర్యానీ, రైతా, చికెన్‌ కర్రీ, మిర్చికా సాలన్‌, సర్వపిండి, ఉల్లికాడ, మురుకులు, సకినాలు, కారాబూందీ, ఎగ్‌ పకోడా, రాగిమిక్చర్‌, బ్రెడ్‌ పకోడా, స్వీట్లు, బేసిక్‌ గ్రేవీల తయారీ నేర్చుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం శనివారం వారు తయారు చేసిన వంటలను రుచి చూసిన అతిథులు మెచ్చుకున్నారు.



మహిళలు తయారు చేసిన తెలంగాణ వంటకాలు

రాష్ట్రంలో మార్చి నాటికి 150 క్యాంటీన్లు ఎస్‌ఈఆర్‌పీ డైరెక్టర్‌ డబ్ల్యూ జాన్సన్‌

రాష్ట్రంలో 2025 మార్చి నాటికి 150 మహిళా శక్తి క్యాంటిన్లను ప్రారంభించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సొసైటీ ఫర్‌ ఎలిమినేషన్‌ ఆఫ్‌ రూరల్‌ పావర్టీ(ఎస్‌ఈఆర్‌పి) డైరెక్టర్‌ డబ్ల్యూ జాన్సన్‌ వెల్లడించారు. గచ్చిబౌలిలోని 'నిథమ్‌' ప్రాంగణంలో 6వ బ్యాచ్‌లో 24 మంది మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో నిథమ్‌ ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఎం.కే.గణేష్‌,సెర్ప్‌ డీపీఎం హమీద్‌, కోఆర్డినేటర్‌ అరుణ్‌, నిథమ్‌ శిక్షణ, ప్లేస్‌మెంట్‌ అధికారి మిషెల్లీ జే ఫ్రాన్సిస్‌ ,మహిళలు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న గాంధీ శిల్పబజార్‌, సంక్రాంతి సంబురాలలో భాగంగా శనివారం మేల చెరువు కామేశ్వరీ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శ ఇచ్చారు. అడుగులు, జతులు, శివాష్టకం, కోలాటం, అష్టలక్ష్మి, కన్నడ జతిస్వరం తదితర అంశాలను కళ్యాణి, శ్రావణి, జస్మిత, మోక్ష, సాత్విక, దీత్య, నమిత, మనోజ్ఞ, వార్షిత, వైష్ణవి తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్‌కె డ్యాన్స్‌ అకాడమీ నృత్యగురువు కల్పన రఘు శిష్యబృందంచే ఆంధ్రనాట్యాన్ని ప్రదర్శించారు. కుంభ హారతి, పుష్పాంజలి, పేరిణి కౌతం, మూషిక వాహన పద్యం, నల్లనివాడు పద్యం అంశాలను కళాకారులు అమేయ, దీక్షిత, ఇసాన్వి, తనుశ్రీ, ధృతి, శ్రీనిధి ప్రదర్శించారు.



నేడు ఉచిత గుండె వైద్య పరీక్షలు

ఆల్విన్‌కాలనీ: జర్నలిస్టుల ఆరోగ్యం దృష్ట్యా ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్‌ జర్నలిస్టుల సంఘం మేడ్చల్‌ జిల్లా శాఖ అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. బండారు ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రముఖ కార్డియాలజిస్ట్‌ డాక్టర్‌ సుశ్రుత్‌ పర్యవేక్షణలో శిబిరం జరుగుతుందన్నారు. ఈసీజీ, 2డి ఈకో, ఆర్‌బీసీలతో పాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వివేకానందనగర్‌లోని బండారు ఆసుపత్రిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. జర్నలిస్టులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

అంబులెన్స్‌లోనే వైద్యం అందించాలి

మాదాపూర్‌: రోగి ఆసుపత్రికి చేరే లోపే అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం అందించాలని రెడ్‌ ఎయిర్‌ అంబులెన్స్‌ హెడ్‌ డాక్టర్‌ మిస్బాహుద్దీన్‌ హబీబ్‌ తెలిపారు. మాదాపూర్‌లో శుక్రవారం రాత్రి రెడ్‌ రాపిడ్‌రెస్పాన్స్‌పై సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగిని సకాలంలో ఆసుపత్రికి చేర్చినప్పుడే ఫలితం ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని రోగులకు అంబులెన్స్‌లోనే అవసరమైన అత్యవసర సేవలు అందించనున్నట్టు తెలిపారు. రెడ్‌ ర్యాపిడ్‌ అంబులెన్స్‌లు అందిస్తున్న సేవలను గూర్చి వివరించారు. కార్యక్రమంలో హాస్పిటల్‌ బిజినెస్‌ వైస్‌ప్రెసిడెంట్‌ ప్రశాంత్‌ అగర్వాల్‌, అపోలో, కిమ్స్‌, ఏఐజీ ఆసుపత్రులతో పాటు నగరంలోని ప్రముఖ ఆసుపత్రుల నుంచి హెల్త్‌కేర్‌ లీడరు పాల్గొన్నారు.

నేడు క్విజ్‌ పోటీలు

చందానగర్‌: జాతీయ యువ దినోత్సవం సందర్భంగా రామకృష్ణ వివేకానంద సేవాసమితి మియాపూర్‌ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 3 గంటలకు క్విజ్‌, బృందగానం, ఉపన్యాసం పోటీలు నిర్వహిస్తున్నట్లు సేవాసమితి సభ్యులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఔత్సాహికులు మియాపూర్‌ రాధా మాధవ్‌ అపార్ట్‌మెంట్స్‌, నీలిమా గ్రీన్స్‌ రోడ్డులోని శ్రీరామకృష్ణ ప్రభ కార్యాలయంలో ప్రొఫెసర్‌ చంద్రశేఖరయ్యను సంప్రదించవచ్చు. ఫోన్‌ : 9849352231.

ముగ్గుల పోటీలు.. బహుమతులు పంపిణీ

చందానగర్‌: మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని బీకే ఎన్‌క్లేవ్‌ కాలనీలో కెకె డిజిటల్‌ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌, బలగం మూవీ ఫేమ్‌ సంజయ్‌లు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌ యాదవ్‌, చంద్రిక ప్రసాద్‌గౌడ్‌, నరేందర్‌ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుప్రజ, నరేష్‌, శివ, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్‌ పాల్గొన్నారు.

బాపూనగర్‌లో..

శేరిలింగంపల్లి: ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌, కొమిరిశెట్టి ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లిలోని బాపూనగర్‌లో రంగోళీ పోటీలు నిర్వహించారు. ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ టి.రామస్వామి యాదవ్‌ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు పండుగలన్నారు. పోటీల్లో పాల్గొన్న వారికి ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. మహిళా నాయకురాలు తస్వీర్‌ బేగం పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న కన్వీనర్‌ రామస్వామి



ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

హత్యకు దారి తీసిన సెల్‌ఫోన్‌ గొడవ

- మద్యం కోసం సెల్‌ఫోన్‌ తాకట్టు
- విడిపించాలని స్నేహితులతో గొడవపడడంతో హత్య
- ముగ్గురు నిందితుల అరెస్ట్‌
- వివరాలను వెల్లడించిన మియాపూర్‌ ఏసీపీ నర్సింహారావు



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ నర్సింహారావు

చందానగర్‌: వ్యక్తి హత్య కేసులో మియాపూర్‌ పోలీసులు నిందితులను అరెస్ట్‌ చేశారు. శనివారం మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ నర్సింహారావు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన కేశవ్‌ బంగార్‌ (39) 15 రోజుల క్రితం హఫీజ్‌పేట్‌కు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజు హఫీజ్‌పేట్‌లోని కూలీ అడ్డాకు వెళ్తున్నాడు. అక్కడ కర్ణాటక రాష్ట్రానికి చెందిన గండె సునీత్‌ (23), సునీల్‌ మదానికర్‌ (25), ప్రేమ్‌ సాగర్‌ నోడ్గి (24)లు అతనికి పరిచయం అయ్యారు. అయితే ఈ నెల 4వ తేదీ మద్యం తాగేందుకు సునీత్‌, మద్దానికర్‌ల వద్ద డబ్బులు లేకపోవడంతో కేశవ్‌ బంగార్‌ సెల్‌ఫోన్‌ తాకట్టు పెట్టి డబ్బులు తీసుకురావాలని మరుసటి రోజు విడిపిస్తామని చెప్పి తాకట్టు పెట్టిన డబ్బులతో హఫీజ్‌పేట్‌ రైల్వే స్టేషన్‌ సమీపంలో మద్యం తాగారు. అదే రోజు సాయంత్రం మద్యం మత్తులో సెల్‌ఫోన్‌ విడిపించాలని కేశవ్‌ తోటి కూలీలతో గొడవపెట్టుకొని చెప్పుతో కొట్టాడు. దీంతో సునీత్‌, మద్దానికర్‌లు కలిసి మరో స్నేహితుడైన ప్రేమ్‌సాగర్‌ నొడ్గిని పిలిచి ముగ్గురు కలిసి అతడిపై దాడి చేశాడు. ఈ క్రమంలో సిమెంట్‌ ఇటుక తీసుకొని కేశవ్‌ తలపై గట్టిగా బాదారు. తీవ్ర రక్తస్రావం అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. మరుసటి రోజు 5వ తేదీ ఉదయం మియాపూర్‌ పోలీసులకు సమాచారం అందడంతో అక్కడకు వెళ్లిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మాదాపూర్‌ ఎస్‌ఓటీ పోలీసులతో పాటు మియాపూర్‌ పోలీసుల దర్యాప్తులో తోటి కూలీలే హత్య చేశారని నిర్ధారించారు. ఈ మేరకు కేశవ్‌ బంగార్‌ను హత్య చేసిన ముగ్గురు నిందితులను శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. దీంతో వారిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసు ఛేదనలో పాల్గొన్న మాదాపూర్‌ ఎస్‌ఓటీ సీఐ సంజయ్‌కుమార్‌, మియాపూర్‌ సీఐ క్రాంతికుమార్‌, ఎస్‌ఐలను అభినందించారు.

అట్టహాసంగా 'సమవర్తన' గ్రాడ్యుయేషన్‌ డే



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పీఎంఐ ఉపాధ్యక్షుడు మనోహర్‌

రాయదుర్గం: గోపన్‌పల్లి సెయింట్‌ జేవియర్స్‌ పీజీ కళాశాలలో 'సమవర్తన' పేరిట శనివారం గ్రాడ్యుయేషన్‌ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రాజెక్ట్‌ మేనేజ్‌మెంట్‌ ఆఫ్‌ ఇండియా (పీఎంఐ) ఉపాధ్యక్షుడు మనోహర్‌ ఎర్రగుంట్ల జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఎంబీఏ విద్యార్థి కమ్యూనికేషన్‌ నైపుణ్యాలు, పరస్పర సహకారం వంటివి పొందేలా ప్రణాళికతో ముందుకుసాగాలన్నారు .అనుభవాల ద్వారానే బ్రాండ్‌ ఇమేజ్‌ను నిర్మించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కె సుధీర్‌, కోశాధికారి నిశిహిత్‌ కుమార్‌, ప్రిన్సిపల్‌ ప్రొఫెసర్‌ టి రవి, అధ్యాపకులు డాక్టర్‌ శ్రీలత, శ్వేత, భారతి, అధికారులు రాజు మూర్తి, జయలక్ష్మీ, నరేష్‌ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

గచ్చిబౌలి: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్‌, కన్‌స్ట్రక్షన్‌ వర్కర్స్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి కన్యగారి నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. శనివారం గచ్చిబౌలిలో భవన నిర్మాణ కార్మికుల లేబర్‌అడ్డా వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం గంటల తరబడి ఎదురుచూసే లేబర్‌ అడ్డాల వద్ద మంచినీళ్లు, టాయిలెట్స్‌ లేక అవస్థల పాలవుతున్నారన్నారు. పనిచేసే ప్రదేశాలలో కొందపడి చనిపోయినా, గాయలపాలైనా భవన నిర్మాణ యాజమాన్యాలు ఆదుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న కార్మికులతో పనులు చేయిస్తూ ప్రమాదంలో గాయపడినా, చనిపోయినా ఎవరికీ తెలియకుండా రాత్రికి రాత్రే పంపించి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర మహాసభలను ఏప్రిల్‌ 21 ,22 తేదీలలో శంషాబాద్‌లో జరుగుతాయన్నారు. ఈ సమావేశాలను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో బీటీసీ శేరిలింగంపల్లి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన జేఎన్‌వీ 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం'



రాయదుర్గం: జవహర్‌ నవోదయ విద్యాలయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ముగిసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, కర్నాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన, అండమాన్‌ నికోబార్‌, పాండిచ్చేరికి చెందిన 4వేల మంది పూర్వవిద్యార్థులు పాల్గొని సందడి చేశారు. ముగింపు వేడుకల్లో విద్యార్థుల వేషధారణ, నృత్యప్రదర్శనలు, నృత్య రూపకాలు, స్కిట్లు అలరించాయి. కార్యక్రమంలో నవోదయ విజన్‌టాక్‌ను నిర్వహించారు. ఇందులో జేఎన్‌వి అడ్మిషన్‌ విజన్‌, హెల్త్‌కేర్‌, కెరీర్‌ గైడెన్స్‌ అండ్‌ కౌన్సిలింగ్‌, క్లీన్‌ అండ్‌ గ్రీన్‌ ఇనీషియేటివ్‌, మ్యూచువల్‌ బెనిఫిట్‌ ఫోకస్‌ వంటి అంశాలపై చర్చించారు. ఎన్‌వీఎస్‌ హైదరాబాద్‌ రీజియన్‌ ఉప సంచాలకులు టి గోపాల్‌ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జేఎన్‌వీ పూర్వ విద్యార్థులు ఐఏఎస్‌ అధికారి గంధం చంద్రుడు, కిమ్స్‌ ఆస్పత్రుల ఎండీ భాస్కర్‌ రావు, ప్రత్యేక అతిథిగా కళ్యాణ్‌రెడ్డి, నవోదయ విద్యాలయ సమితి న్యూఢిల్లీ సంయుక్త కమిషనర్‌ జ్ఞానేంద్రకుమార్‌ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి



గోపన్‌పల్లి మంజీరా డైమండ్‌ టవర్స్‌, పర్పుల్‌ టౌన్‌ ప్రాంతాలలో పర్యటించిన కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: మంజీరా డైమండ్‌ టవర్స్‌వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం గచ్చిబౌలి డివిజన్‌ గోపన్‌పల్లిలోని మంజీరా డైమండ్‌హైట్స్‌, మంజీరా పర్పుల్‌టౌన్‌, మంజీరా డైమండ్‌ టవర్స్‌ గేటెడ్‌ కమ్యూనిటీలను ఆయన సందర్శించి స్థానికులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేయించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కాలనీలో డ్రైనేజీ అవుట్‌లెట్‌ సమస్య, సీసీ రోడ్లు, స్ట్రామ్‌ వాటర్‌ డ్రెయిన్‌ నిర్మాణం, మంజీరా డైమండ్‌ టవర్స్‌ ఈ బ్లాక్‌ సైడ్‌ గేట్‌ మూసివేయడంతో రహదారి నిర్మానుష్యంగా మారిందని, ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలోని పార్కు స్థలంలో ఓపెన్‌ జిమ్‌, చిల్డ్రన్స్‌ పార్కు, క్రీడా ప్రాంగణం, విద్యుత్‌ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టవర్స్‌ అధ్యక్షుడు ప్రసాద్‌, కార్యదర్శి శ్యామ్‌, స్థానికులు అతుల్‌, అంకుర్‌, నటేశన్‌, గోవిందరాజు, సంతోష్‌, అన్షుమన్‌, సోమేష్‌, సీనియర్‌ నాయకులు సురేష్‌, రాజు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరు వెళ్తున్నారా .. జాగ్రత్తలు తప్పనిసరి

సీఐ క్రాంతికుమార్‌





మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మియాపూర్‌: సంక్రాంతి పండగకు ప్రజలు సొంతూర్లకు వెళుతుంటారు. ఇదే అదునుగా చోరీలకు పాల్పడతారు. ఈ క్రమంలో ఊర్లకు వెళ్లేవారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దొంగతనాలను అరికట్టేందుకు మియాపూర్‌ పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఆటోకు మైక్‌ ఏర్పాటు చేసి జాగ్రత్తలు చెబుతూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కాలనీ, బస్తీలలో గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పాటించాల్సినవి...

- ఊర్లకు వెళ్లేవారు తమ చిరునామా, ఫోన్‌ నంబర్‌ సంబంధిత వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేయించాలి.
- ఇంటి తాళం చెవులు, పూలకుండీలలో, డోర్‌ మాట్స్‌ కింద పెట్టకూడదు. ఇంటి తాళం చెవిలు, విలువైన వస్తువులు తమ వెంట తీసుకు వెళ్లాలి.
- ద్విచక్ర వాహనాలు, కార్లు రోడ్లపై పార్కింగ్‌ చేయకుండా ఇంటి ఆవరణలో పార్క్‌ చేసి హ్యాండిల్‌ లాక్‌, వీల్స్‌కు లాక్‌ వేసుకోవాలి. కారు డిక్కీలో విలువైన వస్తువులను పెట్టరాదు.
- ఇంటిముందు చెత్తాచెదారం కనిపించకుండా పనిమనుషులతో నిత్యం శుభ్రం చేయించాలి. న్యూస్‌ పేపర్‌, పాలప్యాకెట్స్‌, ఊర్లకు వెళ్లివచ్చేవరకు వేసుకోకుండా చర్యలు తీసుకోవాలి.
- ఇంటి డోర్‌కు సెంట్రల్‌ లాక్‌ ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్‌లో గమనిస్తూ ఉండాలి. డీవీఆర్‌ను కనిపించకుండా ఇంట్లో రహస్య ప్రదేశాల్లో పెట్టాలి.
- ఊర్లకు వెళ్తున్న విషయాన్ని సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేయకూడదు.
- బంగారం, విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.
- ఇంట్లో ఓ గదిలో లైట్‌ వెలిగే విధంగా చూసుకోవాలని సూచించారు.

సంప్రదించాల్సిన నంబర్లు	
సిఐ క్రాంతి కుమార్‌	9490617129
క్రైమ్‌ డీఐ అక్రమ్‌బాబా	8331013218
క్రైమ్‌ ఎస్‌ఐ మల్సూర్‌	8712663177
ఎస్‌ఐ వెంకటేశ్వర్లు	8712568310
ఎస్‌ఐ నర్సింహారెడ్డి	8712568331
ఎస్‌ఐ రాజేశ్వర్‌రెడ్డి	8712568213
ఎస్‌ఐ చంద్రయ్య	8712568233
ఎస్‌ఐ మాణిక్యం	8712568151
పెట్రోల్‌ మొబైల్‌	8333993414, 8333993415

జాగ్రత్తలు తీసుకోవాలి



సంక్రాంతికి ఊర్లకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలి. పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించి సంబంధిత వివరాలను నమోదు చేయించాలి. సంక్రాంతికి ప్రజలు స్వంత ఊర్లకు వెళ్లడంతో దొంగలు రెచ్చిపోయే అవకాశముంది. ఈ క్రమంలో మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రచారం చేయిస్తూ కాలనీలలో గస్తీని పెంచాం. ఎవరైనా కాలనీ, బస్తీలలో అనుమానాస్పదంగా సంచరిస్తే 100కు కానీ, మియాపూర్‌ పోలీసులకు కానీ సమాచారం అందించాలి. వీలైతే ఇళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మేలు.

– సీఐ క్రాంతికుమార్‌, మియాపూర్‌